



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :273 27 గురువారం ఆగస్టు 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## 'వందేమాతరం' పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన

- రెండు చరణాలే పాడతామన్న సీఎం
- కాంగ్రెస్ నిర్ణయానికి కట్టు బడి ఉంటామని ప్రకటన
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆరు చరణాలు ఆలపించిన వైనం
- అది తనకు తెలియకుండా జరిగిందన్న సీఎం డీకే



ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాం తమని వ్యాఖ్యకర్ణాటకలో ప్రభు త్వ కార్యక్ర మాల్లో 'వందే మాతరం' పూర్తి గేయాన్ని ఆలపిం చబోమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడ తామని తెలిపారు. ఈ విష యంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు.

...మిగతా 2 లో...

## అమెరికా మరో దుందుడుకు చర్య వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**వాషింగ్టన్,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.

## 22ఎను వెంటనే తొలగించాలి

- లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం
- భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ
- రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ...మిగతా 2 లో...

## తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్...

- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి
- ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష



**హైదరాబాద్హైదరాబాద్,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. ...మిగతా 2 లో...

## కోదాడలో బస్సు ప్రమాదం..

### స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి
- హైదరాబాద్-విజయవాడ హైవేపై కంటైనర్‌ను ఢీకొట్టిన బస్సు
- ప్రమాదంలో ఐదుగురు మహిళలతో సహా ఆరుగురు మృతి
- హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతుండగా తెల్లవారుజామున ఘటన

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధా కరమని పేర్కొన్న ఆయన, ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు.మృతుల కుటుంబాలకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్ ట్రక్కును ఒక ప్రైవేటు బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సు సుమారు 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు వెళుతోంది. ఇనుప రాడ్ల లోడుతో ఉన్న కంటైనర్‌ను బస్సు వేగంగా ఢీకొట్టడంతో, ఆ రాడ్లు బస్సు ముందు భాగంలోకి చొచ్చుకువచ్చాయి. ఫలితంగా డ్రైవర్ క్యాబిన్‌తో పాటు ముందు వరుసలోని ప్రయాణికుల సీట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలువురు ప్రయాణికులు బస్సులోనే ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది.

## కోదాడ వద్ద... ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు
- ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం
- మృతులంతా ఎపికి చెందిన వారిగా గుర్తింపు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం...





**సూర్యాపేట,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

"సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ...మిగతా 2 లో..."



## నేపాల్‌లో జల విలయం...

### ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు
- 105 మంది భారతీయు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం
- నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన

...మిగతా 2 లో...

## ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ
- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి

అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది.

...మిగతా 2 లో...

**హైదరాబాద్,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు.



## నిజామాబాద్‌లో ఘనంగా... మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

### కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి

### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, ఆగస్టు 26 ( ప్రజా వీక్షణం ):**

నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు జరిగాయి. కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.

...మిగతా 2 లో...

ప్రజావీక్షణం
దినపత్రిక

# నేపాల్‌లో జల విలయం...
## ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

మొదటిపేజీ తరువాయి

పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం.కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

# 22ఏను వెంటనే తొలగించాలి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22-ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమీషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమీషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

# కోదాడ వద్ద... ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తెలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

# 9వ వార్డులో పారిశుద్ధ పరిరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ

### -వార్డు ప్రజల సంక్షేమానికి నిరంతర కృషి - 9వ వార్డు కౌన్సిలర్ మారుపాక నిహారిక నాగరాజు



**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , ఆగస్టు 26:**

మంథని మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో గల మందాట, రావులచెరువు కట్ట , నడివీధి, పోచమ్మ వాడలో పారిశుద్ధ పరిరక్షణ కోసం బ్లీచింగ్ పౌడర్ ను 9వ వార్డు కౌన్సిలర్ మారుపాక నిహారిక నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందిచే బుధవారం చల్లించడం జరిగింది.పరిశుభ్రమైన వార్డు - ఆరోగ్య కరమైన ప్రజలు అనే లక్ష్యం తో మరింత సమర్ధ వంతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు కౌన్సిలర్ నిహారిక తెలిపారు. వార్డు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నామని, వార్డు పరిధిలోని సమస్యలు తనకు తెలిసేందుకు ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ప్రతిరోజు అన్ని సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యల గురించి వాట్సాప్ గ్రూప్ లో పెట్టిన వెంటనే తాను స్పందించి మున్సిపల్ సిబ్బందిచే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నానన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ సహకారంతో రాబోయే రోజులలో 9వ వార్డును మంథని మున్సిపాలిటీలో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానన్నారు. దీనికి వార్డు పరిధిలోని ప్రజలు సహకరించాలని కౌన్సిలర్ నిహారిక కోరారు.

### తెలంగాణ సమ్మిట్ కోసం
# వార్ రూమ్...

మొదటిపేజీ తరువాయి

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

### నిజామాబాద్‌లో ఘనంగా...
# మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి

ఉత్సవాల్లో భాగంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడచైర్మన్ కేశ వెను, శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ , జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, యువ జన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# 'వందేమాతరం' పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా.. తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలు మాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లు పేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది.కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది.ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ఎ÷-లాన్-ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ఎ÷-లాన్-బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# సంపాదకీయం

## ఆర్థికపతనం దిశగా .. అమెరికా ఫస్ట్ నినాదం !

ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యాసవర ధరలు కూడా పెరిగాయి. ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు. వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్ధమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశియోత్పత్తిలో 126 శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో 83 శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు 250 శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారు లలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరి స్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా 41.1 ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని 2027 ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతిసెకనూ 90వేల డాలర్ల మేరకు, దినసరిన 7.8 బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. 2036 సంవత్సరం నాటికి ఈ రుణభారం 64 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం 1,19,686 డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చా యని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

# ప్రాణాలు పోయాకే మేల్కొంటారా?









**దేవేంద్రనగర్‌లో 'అక్రమ' నిర్మాణాల దూకుడు.. నిబంధనలు గాలికి!**

**60--80 గజాల్లోనే బహుళ అంతస్తుల భవనాలు..**

**సెట్‌బ్యాక్స్, పార్కింగ్, భద్రతా ప్రమాణాలపై తీవ్ర అనుమానాలు**

**"మా ఇష్టం.. మేము చూసుకుంటాం" అంటూ నిర్మాణదారుల దూకుడు?**

**అనుమతులు ఉంటే బయటపెట్టాలి.. ఉల్లంఘనలు ఉంటే కూల్చాలి: స్థానికుల డిమాండ్**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం) :**

చిన్న స్థలం.. భారీ భవనం! ఖాళీ స్థలం కనిపించదు.. పార్కింగ్‌కు చోటు లేదు.. చుట్టూ విద్యుత్ తీగలు.. పక్కనే నివాసాలు.. అయినా అంతస్తుల మీద అంతస్తులు పైకి వెళ్తున్న నిర్మాణాలు. ఇదీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దేవేంద్రనగర్, రావినారాయణరెడ్డి నగర్ ప్రాంతంలో కనిపిస్తున్న దృశ్యమంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తాజాగా స్థానికులు అందించిన ఫొటోలో కనిపిస్తున్న నిర్మాణాన్ని పరిశీలిస్తే.. చిన్న విస్తీర్ణంలోనే బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ భవనానికి ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? ఎంత విస్తీర్ణంలో నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు? ఆమోదిత ప్లాన్‌లో చూపించిన సెట్‌బ్యాక్స్ ఎంత? వాస్తవ నిర్మాణంలో అవే పాటిస్తున్నారా? పార్కింగ్‌కు ఎంత స్థలం కేటాయించారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి.

**అనుమతి ఉంటే.. చూపించండి!**

తెలంగాణ ప్రభుత్వ భవన అనుమతి వ్యవస్థలో భవనానికి సంబంధించిన సైట్ ఏరియా, కవరేజ్, ఖీూ×, ఎత్తు, ఫ్రంట్--రీర్--సైడ్ సెట్‌బ్యాక్స్, పార్కింగ్ వంటి అంశాలు అనుమతి ప్రక్రియలో కీలకంగా ఉంటాయి.అయితే దేవేంద్రనగర్, రావినారాయణరెడ్డి నగర్ ప్రాంతంలో 60--80 గజాల స్థలాల్లోనే భారీగా అంతస్తులు పెరుగుతున్నాయన్న స్థానికుల ఆరోపణలు నిజమైతే.. అసలు ఆ నిర్మాణాలకు ఏ ప్రాతిపదికన అనుమతులు వచ్చాయి? అన్నదే కీలక ప్రశ్న.75 చదరపు గజాల వరకు నివాస ప్లాట్లకు కూడా మినహాయింపు అనేది +తీశీబఅస లేదా +తీశీబఅసం1 స్థాయి నిర్మాణాలకు మాత్రమే వర్తిస్తుంది. అంతకంటే పెద్ద నిర్మాణాలకు సంబంధిత అనుమతి ప్రక్రియ ఉంటుంది.మరి 60--80 గజాల స్థలాల్లో ఐదు, ఆరు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయంటే.. అవి ఏ అనుమతులతో నిర్మిస్తున్నారు?అనుమతి ఉంటే.. ఆ అనుమతి ప్రతిని ప్రజల ముందుంచాలి.అనుమతి లేకుంటే.. నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

**భద్రతా ప్రమాణాలు, సెట్‌బ్యాక్ ఎక్కడ?**

భవనం ఎత్తు పెరిగే కొద్దీ చుట్టూ అవసరమైన ఖాళీ స్థలం, ప్రవేశ మార్గం, అగ్నిమాపక వాహనాల ప్రాప్యత, గాలి--వెలుతురు, పార్కింగ్ తదితర అంశాలు అత్యంత కీలకం.

కానీ చిన్న స్థలంలోనే భవనం మొత్తం స్థలాన్ని ఆక్రమించేలా నిర్మిస్తే.. అత్యవసర సమయంలో ఫైర్ ఇంజిన్ ఎలా చేరుతుంది?

వాహనాలు ఎక్కడ నిలుస్తాయి?

వర్షపు నీరు ఎక్కడికి వెళ్తుంది?

డ్రైనేజీ వ్యవస్థకు స్థలం ఎక్కడుంది?

భవనం చుట్టూ నిర్వహణకు అవసరమైన ఖాళీ ఎలా ఉంటుంది?

ఇవి కేవలం స్థానికుల ప్రశ్నలు కావు.. పట్టణ ప్రణాళికకు సంబంధించిన ప్రాథమిక ప్రశ్నలు.

**'పార్కింగ్'ను గదులుగా మార్చేస్తే?**

నిర్మాణ అనుమతుల్లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని దీబఊశ్రీఎచీశీష అధికారిక ఖీూు స్పష్టం చేస్తోంది. అటువంటి సందర్భాల్లో జరిమానా, తొలగింపు వంటి చర్యలు ఉండవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

అయితే కాగితాలపై పార్కింగ్.. నేలపై నిర్మాణం అనే పరిస్థితి ఎక్కడైనా ఉంటే దాన్ని గుర్తించాల్సిన బాధ్యత ఎవరిది?

**టౌన్ ప్లానింగ్ అధికారులదే కాదా?**

**గచ్చిబౌలి ఘటన హెచ్చరిక కాదా?**

కొద్ది రోజుల క్రితం గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో జరిగిన విషాదం నగరానికి గట్టి హెచ్చరిక ఇచ్చింది. సుమారు 50--60 చదరపు గజాల స్థలంలో నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం కూలిపోవడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పక్కనున్న భవనాలు కూడా దెబ్బతిన్నాయి. అనంతరం ప్రమాదకరంగా ఉన్న మరో నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు.

అక్కడి ఘటనపై అధికారులు చిన్న స్థలాల్లో అనుమతించిన పరిమితికి మించి అంతస్తులు నిర్మించడం వల్ల నిర్మాణ భద్రతపై తీవ్రమైన సమస్యలు తలెత్తినట్లు పేర్కొన్నారు.

అలాంటి ఘటన జరిగిన కొద్ది రోజులకే దేవేంద్రనగర్‌లోనూ ఇలాంటి నిర్మాణాలపై ఫిర్యాదులు, అనుమానాలు వ్యక్తమవుతుండటం ఆందోళన కలిగించే అంశం.

**వాళ్లకు అందాల్సింది అందింది"మేము చూసుకుంటాం" అనే ధైర్యం ఎక్కడి నుంచి?**

స్థానికుల ఆరోపణల ప్రకారం.. నిర్మాణాలను ప్రశ్నించినప్పుడు కొందరు నిర్మాణదారులు "మా ఇష్టం వచ్చినట్లు కట్టుకుంటాం.. మేము చూసుకుంటాం.. ఎవరు ఏం చేసుకుంటారో చేసుకోండి" అన్నట్టుగా సమాధానాలు ఇస్తున్నారని చెబుతున్నారు.ఇంకొందరు "అధికారులతో మాట్లాడుకున్నాం.. అనుమతులు తీసుకున్నాం" అని చెప్పుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఈ ఆరోపణలు నిజమా? కాదా?**

అదే ఇప్పుడు అధికార యంత్రాంగం తేల్చాల్సిన విషయం.ఎవరైనా అధికారులకు డబ్బులు ఇచ్చి అనుమతి తెచ్చుకున్నారనే ఆరోపణ ఉంటే అది తీవ్రమైన విషయం. అయితే ఆరోపణను నిజమని ముందే నిర్ధారించడం కాకుండా.. సంబంధిత భవనాల అనుమతి ఫైళ్లను, ఆమోదిత ప్లాన్లను, సెట్‌బ్యాక్ వివరాలను, అనుమతించిన అంతస్తుల సంఖ్యను అధికారులు బహిర్గతం చేయాలి.

**టౌన్ ప్లానింగ్‌కి అసలైన పరీక్ష..! ఎందుకు గాలికొదిలేస్తున్నారు**

దీబఊశ్రీఎచీశీష నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా నిర్మాణం ప్రారంభించకూడదు. అనధికార నిర్మాణాలు, అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తీసుకునే వ్యవస్థ కూడా ఉంది. ఉల్లంఘనలు గుర్తించిన సందర్భాల్లో కూల్చివేత, జరిమానా, క్రిమినల్ చర్యలు వంటి చర్యలకు నిబంధనలు అవకాశం కల్పిస్తున్నాయి.అంతేకాదు.. అనధికార నిర్మాణంపై ఫిర్యాదు అందినప్పుడు కేసును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థ ఉందని ప్రభుత్వ పోర్టల్ పేర్కొంటోంది. ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచుతామని కూడా అధికారిక ఖీూులో పేర్కొన్నారు.

అయితే దేవేంద్రనగర్‌లో జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్న నిర్మాణాలపై అధికారులు స్థల పరిశీలన చేశారా?

**చేస్తే ఏం తేలింది?**

అనుమతి ఉంటే ఎన్ని అంతస్తులకు?

ఆమోదిత ప్లాన్‌లో సెట్‌బ్యాక్ ఎంత?

వాస్తవంగా ఎంత వదిలారు?

పార్కింగ్ చూపించారా?

నిర్మాణం ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగానే ఉందా?

ఈ ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాలి.

చిన్న స్థలం.. పెద్ద భవనం.. పెద్ద ప్రమాదం?

చిన్న ప్లాట్‌లో భారీ నిర్మాణం అంటే కేవలం భవనం ఎత్తు పెరగడం కాదు. దానికి అనుగుణంగా పునాది, నిర్మాణ రూపకల్పన, లోడ్, పార్కింగ్, అగ్నిమాపక భద్రత, నీటి--మురుగునీటి నిర్వహణ, అత్యవసర మార్గాలు వంటి అనేక అంశాలు కూడా కీలకమవుతాయి.

అందుకే "గోడలు కట్టాం.. అంతస్తులు పెంచాం" అనే ధోరణి నగర భవిష్యత్తుకు ప్రమాదకరం.

ఒక నిర్మాణం కూలిన తర్వాత అధికారులు రంగంలోకి దిగితే ప్రాణాలు తిరిగి రావు.

ప్రమాదం జరిగిన తర్వాత సీజ్ చేస్తే నష్టం పూడదు.

మరణాలు జరిగిన తర్వాత విచారణలు పెట్టినా కుటుంబాల కన్నీళ్లు ఆగవు.

**ఇప్పటికైనా మేల్కొంటారా?**

గచ్చిబౌలి ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పక్క భవనాలు దెబ్బతిన్నాయి. అనంతరం ప్రమాదకర నిర్మాణాలను కూల్చాల్సిన పరిస్థితి వచ్చింది.అదే పరిస్థితి దేవేంద్రనగర్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే ముందస్తు తనిఖీలే మార్గం.కుత్బుల్లాపూర్ పరిధిలో చిన్న ప్లాట్లపై నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. ఒక్కో భవనానికి సంబంధించిన అనుమతి--ఆమోదిత ప్లాన్--సెట్‌బ్యాక్--అంతస్తుల సంఖ్య--పార్కింగ్--నిర్మాణ స్థితిలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.అనుమతి ఉన్న నిర్మాణమైతే నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి.అనుమతి లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.అనుమతి తీసుకుని అదనపు అంతస్తులు నిర్మిస్తే వాటిపై కూడా చర్యలు తప్పక ఉండాలి.అధికారుల నిర్లక్ష్యానికి ఒక్క భవనం బలి అయితే.. దాని కింద సామాన్యుల ప్రాణాలు పోవచ్చు.

**అందుకే ప్రశ్న ఒక్కటే...!!---**

"ప్రాణాలు పోయే వరకు వేచి చూస్తారా.. లేక ప్రమాదం రాకముందే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేస్తారా?"

దేవేంద్రనగర్, రావినారాయణరెడ్డి నగర్‌లో నిర్మాణాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులూ.. ఇది కేవలం ఇటుకలు, సిమెంట్ వ్యవహారం కాదు.

ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించింది.

# మానవ సేవే మహోన్నత సేవ... నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



**నందిగామ ( ప్రజా వీక్షణం - ఆగస్టు 26):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రవక్త మహమ్మద్ (స.అ.వ) జన్మదినం మరియు మదర్ తెరిసా జయంతిని పురస్కరించుకొని స్థానిక గవర్నమెంట్ హాస్పటల్‌లోని రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రవక్త మహమ్మద్ (స.అ.వ.) బోధించిన ప్రేమ, కరుణ, సోదరభావం మరియు మదర్ తెరిసా చూపిన సేవా మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. "మానవ సేవే మహోన్నత సేవ" అనే సందేశంతో రోగులకు పండ్లు అందించి, వారి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజని, అనిత, న్యాయవాది ఆజాద్, డాక్టర్ వినుకొల్లు నవీన్ బాబు, ఆంజనేయులతో పాటు హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

# బాపట్లలో హోరెత్తుతున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి" హవా

## దగ్గుమల్లి వారి పాలెంలో దగ్గుమల్లి రాణి సుడిగాలి పర్యటన - ఇంటింటికీ కూటమి సంక్షేమ పథకాల వివరణ

బాపట్ల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న వేళ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి కార్యక్రమం బాపట్ల నియోజకవర్గంలో పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. బాపట్ల శాసనసభ్యులు, యువ నాయకులు వేగేశన నరేంద్రవర్మ రాజు ఆదేశాల మేరకు, ఆయన దిశా నిర్దేశంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి గడపలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాపట్ల మండలం దగ్గుమల్లి వారి పాలెంలో స్థానిక నాయకురాలు, ఫైర్ బ్రాండ్ దగ్గుమల్లి రాణి ఆధ్వర్యంలో భారీ ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను నోట్ చేసుకుని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దగ్గుమల్లి రాణి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వం. మా నాయకులు, మా అన్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు రెండేళ్లలోనే బాపట్ల రూపురేఖలే మార్చేశారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. కానీ మా ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమం,ప్రతి ఊరికి అభివృద్ధి చేరుతోంది తల్లికి వందనం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతన్నకు పెట్టుబడి సాయం, వృద్ధులకు,వితంతువులకు, దివ్యాంగులకు పెన్షన్లను రూ.4 వేలకు పెంచి ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచాం.బాపట్ల నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు,తాగునీటి పథకాలు,ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కాదు మౌలిక వసతుల కల్పన, వైద్య రంగంలో మెరుగైన సేవలతో బాపట్లను రాష్ట్రంలోనే



ఆదర్శ నియోజకవర్గంగా నిలుపుతున్నాం .వేగేశన మార్క్ పాలన అంటే ఇదే. ఎన్నికల సమయంలో ప్రజలు మాపై పెట్టిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో,మా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముందుకు వెళుతున్నాం.బాపట్ల జిల్లాను, బాపట్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ గా నిలపాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు రేయింబవళ్లు కష్టపడు తున్నారు. ఆయన సంకల్పానికి మనందరం అండగా ఉండాలి, ఆయన వెంట నడవాలి అని పిలుపునిచ్చారు. అనంతరం పవిత్ర మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని దగ్గు మల్లి రాణి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.మిలాద్-ఉన్-నబీ పవిత్ర పర్వదినం సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.దయ,కరుణ, శాంతి,సహనానికి ప్రతీక అయిన మహమ్మద్ ప్రవక్త బోధనలను మనమందరం ఆచరించాలి.అల్లాహ్ ఆశీస్సులు,దీవెనలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని,ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐక్యమత్యంతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,బీజేపీ కూటమి నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు, యువత,స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# ఎస్‌పీఎం పరిశ్రమలో గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి..

## 99వ రోజు రిలే నిరాహార దీక్షలు -- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 26 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్ పి ఎమ్) పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేటికి 99వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు దీక్షలను ముంజం ఆనంద్ కుమార్, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ప్రారంభించగా, గోకర్ల రాములు, ఏకే సింగ్ దీక్షల్లో కూర్చున్నారు.ఈ సందర్భంగా ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల ప్రజాస్వామ్య హక్కైన గుర్తింపు ఎన్నికలను నిర్వహించకుండా యాజమాన్యం, ప్రభుత్వం కాలయాపన చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.99 రోజులుగా కార్మికులు శాంతియుతంగా నిరసన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం కార్మికుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.కార్మికుల సహనాన్ని పదేపదే పరీక్షిస్తూ సమస్యను మరింత జటిలం చేయవద్దని హెచ్చరించారు. కార్మికులను ఒత్తిడికి గురిచేస్తూ, వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా కొనసాగితే వారి ఆవేదన, ఆగ్రహం తీవ్ర స్థాయికి చేరుకునే పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా యాజమాన్యం, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి అని కోరారు.కార్మికుల హక్కులను కాలరాస్తూ గుర్తింపు ఎన్నికలను వాయిదా వేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఎన్నికలు నిర్వహించకుండా కార్మికుల గొంతును అణచివేయాలని చూస్తే కార్మిక వర్గం ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత బలమైన ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.ఎస్‌పీఎం యాజమాన్యం వెంటనే కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి గుర్తింపు ఎన్నికలకు మార్గం సుగమం చేయాలని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత అధికారులను ఆదేశించి గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు.కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దు -- సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఎస్‌పీఎంలో గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో కుశన రాజన్న వెంకటేష్ పోశం షబీర్ పాల్గొన్నారు




# ఈ నెల 30న విజయవాడలో సంచార,అర్ధ సంచార,విముక్త జాతుల స్ఫూర్తి దినోత్సవం

చీరాల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )

చీరాల పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సంచార, అర్ధసంచార,విముక్తి జాతుల స్ఫూర్తి విముక్తి దినోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న స్ఫూర్తి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సీ.బీ.ఎన్. మాధవ్,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ సూచనల మేరకు,బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు గారి అధ్యక్షతన, బాపట్ల జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ తాడివలస దేవ రాజు ఆధ్వర్యంలో సంచార,అర్ధసంచార,విముక్త జాతుల విముక్తి దినోత్సవం స్ఫూర్తి కార్యక్రమం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు మాట్లాడుతూ, డి.ఎన్.టీ./ఎన్.టీ. (De-notified Tribes/ Nomadic Tribes) జాతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. జనాభా పరంగా తక్కువగా ఉన్నప్పటికీ, ఈ జాతులు భారతదేశ చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్య పోరాటంలో అందించిన సేవలను భారతీయ జనతా పార్టీ గుర్తిస్తోందన్నారు. ఈ వర్గాలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, వారి హక్కులు, గుర్తింపు, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 30న స్ఫూర్తి విముక్తి దినోత్సవం నిర్వహించడం ద్వారా వారి చరిత్ర, సేవలను సమాజానికి తెలియజేస్తున్నామని తెలిపారు.ఓబీసీ మోర్చా బాపట్ల జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ, సంచార,అర్ధసంచార,విముక్తి జాతులు భారతదేశ చరిత్రలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు.బ్రిటిష్ పాలనలో అనేక ఇబ్బందులు, అన్యాయాలను ఎదుర్కొన్న ఈ వర్గాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సమాచారాన్ని చేరవేస్తూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటంలో తమ వంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఇలాంటి వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా,వారికి గుర్తింపు కార్డులు అందించడం ద్వారా విద్య,వైద్యం,గృహ




నిర్మాణం తదితర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.సంచార, అర్ధసంచార,విముక్తి జాతుల హక్కులు,అభివృద్ధి,సంక్షేమం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, నియోజకవర్గ,మండల నాయకులు,ఓబీసీ మోర్చా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ నెల 30న విజయవాడలో జరిగే స్ఫూర్తి విముక్తి దినోత్సవ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, సంచార, అర్ధసంచార,విముక్తి జాతుల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మువ్వల వెంకటరమణారావు,డాక్టర్ తాడివలస దేవరాజు,సాయిల కృష్ణార్జున్,క్షత్రియ సుహాసిని బాయ్,పల్లెపు లావణ్య , తడవర్తి చంద్ర ,పింజల భరణి రావు, మేడికొండ భరణి రావు, కాకర్ల శ్రీ వెంకటేశ్వరరావు , పేర్ల బ్రహ్మయ్య , మానేపల్లి బాలాజీ ,గోలి సాయి బీజేపీ నాయకులు,ఓబీసీ మోర్చా నాయకులు,బిజెపి కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల పట్టణం 34వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం

బాపట్ల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )

బాపట్ల పట్టణం 34 వ వార్డు 70వ బూత్ లో బుధవారం బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో సంక్షేమం,అభివృద్ధి ఏ విధంగా జరిగింది అనే విషయాన్ని వివరిస్తూ,కూటమి ప్రభుత్వ సంక్షేమం,అభివృద్ధి గురించి కుటుంబ సభ్యులకు వివరిస్తూ వారి ఫోటోలను మై టీడీపీ యాప్ లో అప్లోడ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి ఆంద్రేయ్య,టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ,టీడీపీ నాయకులు పల్లం జీవన్,టీడీపీ బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి,పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ నజ్మా,వార్డు అధ్యక్షులు గవిని హరిబాబు,సజ్జన రావు,మన్నెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోలవరం నియోజకవర్గంలో జోరందుకున్న కాంగ్రెస్ రాజకీయాలు...

## జీలుగుమిల్లిలో ఘనంగా కాంగ్రెస్ కమిటీ సమావేశం!

జీలుగుమిల్లి, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం):

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ కమిటీ సమావేశం మండల అధ్యక్షులు సున్నం రామారావు అధ్యక్షత వహించగా అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కీలక సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరాగా, జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మరియు పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ బండి విజయ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ బండి విజయ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికులా పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలనే దానిపై శ్రేణులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందిస్తూ రాజకీయ ప్రణాళికను సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో సున్నం రామారావును జీలుగుమిల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని కోరిన రాజనాల రామ్మోహన్ రావు, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పోటీ




చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో శంకుస్థాపనలు చేసిన పలు మంచి ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వాలు తమ ఘనతగా చెప్పుకుంటున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థను మరింత బలోపేతం చేయాలని శ్రేణులకు సూచించారు. మండల అధ్యక్షుడిగా నియమితులైన సున్నం రామారావుకు పలువురు నాయకులు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి భాస్కర్, నరసింహారావు, చిడిపీ కుటుంబరావు, గుత్తుల సత్యనారాయణ, ముచ్చిక సీత, మడకం నాగరాజు, తాడేపల్లి వెంకటేష్, కుంజా కుమారి, బొమ్మిరెడ్డి శివరామరెడ్డి తదితరులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# రోగులకు పండ్ల పంపిణీ చేసిన మైనార్టీ నాయకులు..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజావి క్షణం

దేవరకద్ర నియోజకవర్గంలో మున్సిపాలిటీ లో బుధవారం మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్ల పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో ముస్లిం సోదరులు ఎండీ హసనొద్దీన్ ఎండీ సిరాజ్, సయ్యద్ అయ్యుబ్, జిల్లు రెహమాన్, ఇమ్రాన్, అభిద్,ఖాదర్, ఆమెర్, మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు.



# మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత సమాజానికి సంఘ మిత్రలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 26 (ప్రజా వీక్షణం న్యూస్)

మాదకద్రవ్యాల నిర్మూలన లో మహిళా సంఘాలు కీల క పాత్ర పోషించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ లో మహిళా సంఘాల సభ్యులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సంఘమిత్ర-- మాదకద్రవ్యాల నిర్మూలన' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా కమిషనర్ శ్వేత మాట్లాడుతూ.. డ్రగ్స్ విక్ర యాలు, వినియోగం లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే 112కు సమా చారం ఇవ్వాలని, వివరా లు గోప్యంగా ఉంచుతామ ని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, మహిళా సంఘం బాధ్యత అన్నారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝామాట్లాడుతూ జిల్లాలోని సుమారు 1.25 లక్షల మంది మహిళా సం ఘాల సభ్యుల ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక అవ గాహన తీసుకెళ్లాలని సూచించారు. జనగామను మాదకద్రవ్య రహిత జిల్లా గా తీర్చిదిద్దేందుకు అంద రూ భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. డీసీ పీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మొదట సరదాగా మొదలై ప్రాణాంతక వ్యసనంగా మారుతుందని హెచ్చరిం చారు. సదస్సులో సైకాలజి స్ట్ డా. విజయక్రాంతి అవ గాహన కల్పించగా, పోలీస్ జాగృతి కళాబృందం నాటి కల ద్వారా డ్రగ్స్ దుష్ప్రభా వాలను వివరించింది. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.




# వివాహ వేడుకల్లో పాల్గొన్న బిజెపి నాయకులు..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా వీక్షణం

దేవరకద్ర మండల కేంద్రానికి చెందిన మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అనిల్ తమ్ముని వివాహం బుధవారం మన్నెంకొండ దేవస్థానం సమీపంలో జరగగా ఈ వేడుకలో మండల బిజెపి నాయకులు నాగిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, విద్యాసాగర్, సత్యనారాయణ, శీను, పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



# ఏరియా హాస్పిటల్ లో పండ్లు, బ్రేడ్స్ అందజేసిన రజని

బాపట్ల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )

బుధవారం బాపట్ల పట్టణంలోని పొట్టి శ్రీరాములు ఏరియా హాస్పిటల్ లో సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని క్షతగాత్రులకు పండ్లు మరియు బ్రేడ్స్ ను అందజేశారు.అలాగే వారి యోగక్షేమాలను అడిగి ధైర్యంగా ఉండాలని,సమయానికి మందులు వేసుకోవాలని తెలియజేశారు.తనకు ఈ అవకాశం కల్పించిన హాస్పిటల్ సూపరిటెండెంట్ డాక్టర్ సిద్దార్థ కి,హాస్పిటల్ సిబ్బందికి ధన్యవాదములు తెలియజేశారు.



# అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మదర్ థెరిస్సాకు ఘన నివాళి డాక్టర్ గుదే రాజారావు

## బీఎస్పీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు

బాపట్ల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )




భారతదేశానికి ఉపాధ్యాయినిగా వచ్చి, పేదలు,అనాథలు,రోగులు, నిరాశ్రయుల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు మదర్ థెరిస్సా అని బహుజన సమాజ్ పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గుదే రాజారావు కొనియాడారు."పేదలు నాకు దేవుడిచ్చిన వరాలు" అనే భావంతో సేవను తన జీవిత ధ్యేయంగా చేసుకున్న ఆమె, 1950లో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థను స్థాపించి ప్రపంచవ్యాప్తంగా అనేకమంది నిరుపేదలకు ఆశ్రయం,వైద్యం, ఆహారం ,ప్రేమను అందించారని తెలియజేశారు.ఆమె నిస్వార్ధ సేవలకు గుర్తింపుగా నోబెల్ శాంతి బహుమతి (1979), భారతరత్న (1980) వంటి అత్యున్నత పురస్కారాలు లభించాయని అన్నారు.కులం,మతం,ప్రాంతం అనే భేదాలు లేకుండా దీనుల పట్ల ప్రేమను చూపిన మదర్ థెరిస్సా జీవితం "మానవ సేవే మహోన్నత సేవ" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించిందని తెలిపారు.మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆ మహనీయురాలి సేవా స్ఫూర్తికి ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు.

# రక్షాబంధ న్ అంటే.. రక్త సంబంధం..

## అదే అన్నా చెల్లెలు.. అక్క తమ్ముడు అనుబంధం..

## రేపే రక్షాబంధన్ వేడుకలు..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజావిక్షణం

రాఖి అంటే రక్త బంధానికి ఒక విలువైన పదం రక్త బంధా లకు విలువనిస్తూ ప్రేమ అభిమానాలతో అక్క చెల్లెల్లు అన్నదమ్ములకు రాఖి కట్టి పది కాలాలపాటు చల్లగా ఉండమని అక్కచెల్లెళ్ల దీవెన అన్నదమ్ములకు శ్రీరామరక్ష ఎన్ని బా రిన ఎన్ని వచ్చినా విడదీయని బంధం ఈ రక్త సంబంధం ఇదే పౌర్ణమి నాడు వచ్చే ఈ పండగ రాఖీ పండుగ కలకాలం కలతల లేక కాలమంతా ఈ బంధం ఇలాగే నిలవాలని ప్రతి ఇంట ఒక పండగగా జరుపుకునే ఈ రాఖీ పండగ సుఖ సంతోషాలతో జీవితం సాగాలని కల్మషం లేని మనసుతో నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని అక్క దీవెన బ్రహ్మ దీవెనల నిలవాలి ఈ పండగ. చేతికి కట్టిన చిన్నదారమై చెలిమి చిగురించే వేళ చెల్లి నవ్వులో వెన్నెలై అన్న మనసులో మమత మమతలు ముడిగా కొనసాగుతాయి. బాల్యపు బంగారు జ్ఞాపకాలు మళ్లీ కళ్ళ ముందు కదలొస్తే అల్లరి చేసిన ఆ రోజులు అందమైన జ్ఞాపకాలై మురిసిపోతాయి. రాఖీ కట్టిన ఆ క్షణాన మాటలందని ప్రేమ పలుకుతుంది. నువ్వు ఉన్నావని ధైర్యం చాలు అంటూ ఒక మనసు మరో మనసును చేరుతుంది. దూరాలు ఎన్ని పెరిగిన దారాల మధ్య బంధం తెగదు. కాలము ఎన్ని మలుపులు తిరిగినా అన్నాచెల్లెల మమత మాత్రం వా డిపోదు. రాఖీ అంటే ఒక దారం కాదు రెండు హృదయాల మధుర జ్ఞాపకం రక్షాబంధన్ అంటే ఒక పండుగ కాదు జన్మజన్మల అనుబంధానికి చిరునవ్వుల సంతకం.



# నవ వధువు చి:ల:సౌ గౌతమి ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన గాదె మధుసూధన రెడ్డి

బాపట్ల : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )

బాపట్ల నియోజకవర్గం, పిట్టలవానిపాలెం మండలం, అల్లూరు రెడ్లపాలెం గ్రామంలోని అక్కల వెంకట కృష్ణారెడ్డి శివ పార్వతిల కనిష్ట పుత్రిక చి:ల:సౌ గౌతమి కి వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి అక్షింతలు వేసి ఆశీర్వదించి,వివాహ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన వెంట మంతెనవారిపాలెం మాజీ ఎంపీటీసీలు కొర్లపాటి కోటయ్య,నర్రా శ్రీనివాసరావు,గోవతోటి విజయ్,దేగల రవి రెడ్డి,నర్రా నాగ శ్రీనివాస్,పులుగు సుబ్బారెడ్డి,నంగు శ్రీనివాసు రెడ్డి,పులి నాగేశ్వరరావు, ముచ్చు వెంకట్రామిరెడ్డి,అక్కల వీర రాఘవ రెడ్డి మరియు గాదె యువసేన యువకులు ఉన్నారు.



# స్నేహితుని కూతురి పెళ్లికి సాయం అందించి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజావిక్షణం

తన స్నేహితుడు ఆడ కూతురు పెళ్లి చేసేందుకు పడుతున్న కష్టాన్ని చూసి పూర్వ విద్యార్థులు తమ వంతు సాయం అందించి బుధవారం అండగా నిలిచారు. దేవరకద్ర బాలుర పాఠశాలలో 1998 -1999 ఏడాదిలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు దేవరకద్ర మండల పరిధిలోని డోకూర్ గ్రామానికి చెందిన మ్యాదరి ఆంజనేయులు జ్యోతి దంపతుల కూతురు అనిత వివాహం కుదిరింది. ఆంజనేయులు జ్యోతి దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడంతో పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా రూ.25వేల నగదును అందించి అండగా నిలిచారు. బుధవారం మన్నెంకొండ దేవస్థానం వద్ద వివాహం జరిగింది.స్నేహితుడి కూతురి పెళ్లికి ఖర్చుల నిమిత్తం సాయం అందించినట్లు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పెళ్లికి సాయం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీష్, వెంకటేశ్వర్ రెడ్డి, రాజు, జయరాజు, వెంకటేష్, రమేష్,కురుమూర్తి, పాల్గొన్నారు.



# కైకలూరులో ఘనంగా మదర్ థెరిస్సా 116వ జయంతి వేడుకలు

కైకలూరు, ఆగస్టు 26:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం, కైకలూరు మండలం, పట్టణ కేంద్రంలో మంగళవారం విశ్వమాత, భారతరత్న మదర్ థెరిస్సా 116వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మదర్ థెరిస్సా విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి పైడిమర్రి రాధాకృష్ణ, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానము ఛైర్మన్ లక్కింశెట్టి రామమోహనరావు, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటి డైరెక్టర్ ఎమ్.డి.ఉస్మాన్, పట్టణ టిడిపి అధ్యక్షులు పడమట వాసు, ప్రధాన కార్యదర్శి రసూల్ ఖాన్, మండల తెలుగు మహిళ మాజీ కార్యదర్శి శీలం కృష్ణవేణి, మండల టిడిపి ఉపాధ్యక్షులు మహ్మద్ జహీర్, వేములపల్లి కారుణ్య, దైతగుంజ రామస్వామి, ఏగిరెడ్డి సురేష్, కట్టా శ్రీనివాసరావు, హబీబ్ పాషా, రహీమ్, అట్లూరి రాజేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మదర్ థెరిస్సా సేవలను స్మరించుకున్నారు.



# జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూతురు ఆల ప్రీతి రెడ్డి..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని కోయిల్ సాగర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్వామి సోదరుడు నరేందర్ కూతురు ప్రియన్షి జన్మదిన వేడుకల్లో బుధవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూతురు ఆల ప్రీతి రెడ్డి, పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో గొల్లమోని శ్రీను, నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదలంకలో ఘనంగా దాసరి జాన్ హైడ్ - హనీ వివాహ వేడుక

## - హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ రాష్ట్ర దళిత నాయకులు జక్కుల విజయ్ కుమార్

## - దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు, విద్యావేత్తలు, గ్రామస్తులు

కైకలూరు (కలిదిండి) ఆగస్టు 26:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం, కలిదిండి మండలం పరిధిలోని ప్రసిద్ధ గ్రామమైన పేదలంకలో నేడు వివాహ వేడుక అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగింది. పేదలంక గ్రామానికి చెందిన దాసరి జాన్ హైడ్ మరియు హనీ ల కల్యాణ మహోత్సవం బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో కనులపండువగా నిర్వహించబడింది.ఈ వివాహ వేడుకకు దాసరి జాన్ హైడ్ ప్రత్యేకంగా ఆహ్వానించడంతో... తెలుగుదేశం పార్టీ రాష్ట్ర దళిత నాయకులు జక్కుల విజయ్ కుమార్ విచ్చేశారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ఈ వేడుకలో ప్రత్యక్షంగా పాల్గొని నూతన వధూవరులకు తమ అపూర్వ ఆశీస్సులు అందజేశారు. హాజరైన వారిలో ప్రముఖ కామర్స్ లెక్చరర్ కాకర్ల కిషోర్, దళిత నాయకులు చాబత్తిన రాజు, అందుగల మధుబాబు, కొనాలా వినయ్, కంప్యూటర్ లెక్చరర్ బేతాల సతీష్ తదితరులు ఉన్నారు.వివాహ వేదిక వద్దకు చేరుకున్న టీడీపీ రాష్ట్ర నాయకులు జక్కుల విజయ్ కుమార్ మరియు ఇతర అతిథులకు వధూవరుల కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేదికపై ఉన్న నూతన వధూవరులు దాసరి జాన్ హైడ్ – హనీ ల దంపతుల వద్దకు వెళ్లి, వారిపై అక్షింతలు చల్లి మనసారా ఆశీర్వదించారు. ఈ నూతన దంపతులు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అన్యోన్యతతో, అష్టఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో



వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జీవితంలో కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్న ఈ జంటకు భగవంతుని కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆశీస్సులు అందజేశారు.రాష్ట్ర స్థాయి ప్రముఖులు, పలువురు ప్రముఖ అధ్యాపకులు, నాయకులు ఒకే వేదికపైకి రావడంతో పేదలంక గ్రామంలో సందడి నెలకొంది. ఈ వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు, బంధుమిత్రులు నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుక అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అతిథులు, గ్రామస్తులు అందరూ కలిసి పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జాన్ హైడ్ – హనీ ల వివాహం స్థానికంగా అందరిచేత ప్రశంసలందుకుంటూ మరువలేని వేడుకగా నిలిచింది.

# బాచుపల్లిలో వుడ్‌వెక్సా షోరూమ్ ప్రారంభం

కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన వుడ్‌వెక్సా ప్లైవుడ్, లామినేట్స్, హార్డ్‌వేర్ అండ్ ఇంటీరియర్స్ షోరూమ్‌ను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బాచుపల్లి వాసులు నిక్కంటి వెంకటకృష్ణ, నిక్కంటి వెంకటరాయుడు, నిక్కంటి వీర రాఘవులు ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బాచుపల్లి ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్లైవుడ్, లామినేట్స్, హార్డ్‌వేర్, ఇంటీరియర్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని షోరూమ్ నిర్వాహకులకు సూచించారు. సంస్థకు మంచి పేరు, గుర్తింపు లభించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొలన్ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, బాచుపల్లి డివిజన్ అధ్యక్షుడు కొలన్ జీవన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నవీన్, విక్రాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాల జోలికి వెళ్తే.. భవిష్యత్తు చిత్తే!

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం) :

మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును ఛిన్నాభిన్నం చేస్తుందని, ముఖ్యంగా 25 ఏళ్లలోపు యువత మాదకద్రవ్యాల బారిన పడటం ఆందోళన కలిగించే అంశమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నశా ముక్త్ భారత్ అభియాన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్‌లోని తన నివాస కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, యువకులతో కలిసి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి యువతే వెన్నెముక అని, వారి శక్తి, ప్రతిభ దేశాభివృద్ధికి వినియోగపడాల్సిన సమయంలో మత్తు పదార్థాల బారిన పడటం సమాజానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా విద్య, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, సామాజిక జీవితం కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాంతం దాని ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



### అవగాహనతోనే అడ్డుకట్ట

యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని వివేకానంద్ సూచించారు. యువతలో క్రీడలు, విద్య, ఉపాధి, సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తిని పెంచడంతోపాటు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజయోగిని బీకే. జ్యోతి బహన్‌జీ, ఎస్ఆర్ నగర్ ఇన్‌చార్జి బీకే. మంజుల, బీకే. నాందేవ్, బీకే. నరేందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలదే కీలక పాత్ర

## అభివృద్ధి దిశగా సమష్టిగా పనిచేయాలి: ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం)

: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో సంక్షేమ సంఘాలు క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు.131వ డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధిలోని రామకృష్ణనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కాలనీలో మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై సంక్షేమ సంఘాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.రామకృష్ణనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ అబ్దుల్ వాహేద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, కోశాధికారులుగా లలిత, రమేష్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సభ్యులు నరసయ్య, సాగర్, రాములు, సాయిలు, డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకుడు కిషోర్ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఏకగ్రీవంగా దేవరకద్ర పి ఆర్ టి యు టి ఎస్ ఎన్నికలు..

## అధ్యక్షులు గా రఘువర్ధన్ రెడ్డి

## ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా విక్షణం

పి ఆర్ టి యు టి ఎస్ దేవరకద్ర మండల శాఖ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. దేవరకద్ర జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పి ఆర్ టి యు అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పి ఆర్ టి యు టి ఎస్ మండల సర్వ సభ్య సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి.మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు వి.బుచ్చా రెడ్డి లు ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు వ్యవస్థాపకులు సామాల యాదగిరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంత్ యాదవ్ ప్రవేశ పెట్టిన ప్రధాన కార్యదర్శి నివేదికను ముక్త కంఠంతో ఆమోదించారు.సర్వ సభ్య సమావేశానంతరం జరిగిన మండల శాఖ ఎన్నికలకు మహబూబ్ నగర్ రూరల్ మండల శాఖ అధ్యక్షులు గడ్డం అంజయ్య ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా పి ఆర్ టి యు సీనియర్ నాయకులు,రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షులు గా రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ యాదవ్ లు తిరిగి రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సూర్మి రాఘవేందర్, మహిళా మండల అసోసియేట్ అధ్యక్షురాలుగా జయమ్మ, మండల ఉపాధ్యక్షులు గా, ఎ.పవన్ కుమార్, నరేందర్ శర్మ, మహిళా ఉపాధ్యక్షురాలుగా అరుణ, వీణారాణి, మండల కార్యదర్శులు గా బి శ్రీధర్, హేమంత్ కుమార్,




మండల మహిళా కార్యదర్శులుగా, దివ్య భారతి, అనురాధ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యావర్గానికి ఎన్నికల అధికారి అంజయ్య, పరిశీలకులు లయన్ అశ్విని చంద్రశేఖర్ లు ధ్రువ పత్రాలను ప్రదానం చేశారు. కాగా ప్రమాణ స్వీకారం చేసిన నూతనంగా కార్యవర్గాన్ని జిల్లా బాధ్యులు మదన్ మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి, బుచ్చా రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్ లు ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో యం ఈ ఓ బలరామ్, జి హెచ్ యం లు రమేష్, రామ లింగం, పి ఆర్ టి యు టి ఎస్ మాజీ అధ్యక్షులు నారాయణ గౌడ్, నాయకులు తిమ్మారెడ్డి, డి. కవిత, సురేష్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని శాంతి వైపు నడిపించిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త..

దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా విక్షణం

ప్రపంచాన్ని శాంతి, సౌభ్రాతృత్వం వైపు నడిపించిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని, మౌలానా అన్నారు. బుధవారము దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక జమీయ మసీదులో మిలాద్ -ఊను - నభి మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మహ్మద్ ప్రవక్త యొక్క ధార్మిక సందేశాన్ని ఆయన వివరించారు. బోధించిన ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమనిఆయన అన్నారు.ఈ పవిత్ర మిలాద్-ఉన్-నబీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని నింపాలని, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం)

ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక గణేష్‌నగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గది నిర్మాణానికి కీర్తిశేషులు దింటకుర్తి వెంకట కృష్ణారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి డీవీకే గీతామణి రూ.5 లక్షల విరాళాన్ని బుధవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో కళాశాల నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే కళాశాల భవన నిర్మాణానికి చేయూత అందించిన గీతామణి సేవాభావాన్ని అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన ప్రజా-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్య విధానంలో భాగంగా చేపడుతున్న కళాశాల నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.విద్యాభివృద్ధికి దాతలు, ప్రజలు మరింతగా సహకరించి కళాశాల నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

27 గురువారం ఆగస్టు 2026

7

www.prajaveekshanam.in

## మానవతా విలువలను చాటేదే మిలాద్-ఉన్-నబీ

### శాంతి, సహనం, పరస్పర గౌరవాన్ని ఆచరించాలి: ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం):**

ప్రవక్త మహమ్మద్ (స) బోధించిన శాంతి, సహనం, పరస్పర గౌరవం, పేదల పట్ల దయ, మానవ సేవ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మిలాద్–ఉన్–నబీ పర్వదినం సందర్భంగా 126వ డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలోని మగ్దూం నగర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిలాద్–ఉన్–నబీ పండుగ కేవలం ఒక పర్వదినం మాత్రమే కాకుండా శాంతి, ప్రేమ, కరుణ, మానవతా విలువలను చాటే సందేశాన్ని అందిస్తుందని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ సోదరభావంతో మెలగాలని సూచించారు. పేదలు, బలహీన వర్గాల పట్ల దయ, సేవా భావాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. మిలాద్–ఉన్–నబీ పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని ముస్లిం సోదర సోదరీమణులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. 'ప్రేమ, శాంతి, కరుణ.. ప్రవక్త మహమ్మద్ (స) చూపిన మానవతా మార్గం' అనే సందేశంతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు ఎండీ. ఆజం, సీనియర్ నాయకులు సయ్యద్ సాజిద్, పాషా, ఖయ్యూమ్, మహమ్మద్ మెహమూద్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ సోహెల్, ఎస్.కె. జావీద్, మహమ్మద్ ఖదీర్, మహమ్మద్ అక్బర్, సయ్యద్ జలీల్, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు..

**దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా వీక్షణం**

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారము టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మిథున్ రెడ్డి,ని శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాష్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ,బెక్కరి మధుసూదన్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏపీ మిథున్ రెడ్డి,కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ, ప్రజల మన్ననలు పొందాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.




## మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించండి..

**దేవరకద్ర ఆగస్టు 26 ప్రజావిక్షణం**

మండల పరిధిలోని మిని గోని పల్లె 8వ వార్డ్ గ్రామం నుంచి దేవరకద్ర కు వస్తూ ఉంటే ఫస్ట్ స్పీడ్ దగ్గర మా గ్రామంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు , అని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బన్నీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ కొద్దిగా ఇబ్బంది ఉంది , ఆ చెట్లను ఏమైనా మరమ్మతులు చేయండి అని ఆయన కోరారు. మలుపుల వద్ద చెట్లు ఉన్నందుకు ఎదురుగా వస్తున్న వాహనాలు ఇక్కడి నుంచి వెళ్తున్న వాహనాలకి యాక్సిడెంట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, అని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని స్పందించి మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్మన్ ఈ సమస్యని తొందరగా పరిష్కారం చేయాలని ఆయన కోరారు.



# అయోధ్యలో కమనీయంగా సీతారాముల వారి కల్యాణం..





### రామ మందిర్ చరిత్రలో తొలిసారి వేడుక..

### తెలంగాణ సాధు పరిషత్ సారథ్యం

### మేయర్‌తో పాటు ప్రముఖుల హాజరు..

### వేదఘోషల మధ్య వైభవం..

**దేవరకద్ర ఆగస్టు 26 ప్రజా వీక్షణం**

అయోధ్య క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధల మధ్య కమనీయంగా జరిగింది. అయోధ్య చరిత్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి తెలంగాణ సాధు పరిషత్ సారథ్యం వహించింది. లోకకళ్యాణం, ధర్మరక్షణ లక్ష్యాలతో ఛత్రపతి శివాజీ పీఠాధిపతి శ్రీ బైలూరి యోగేష్ ప్రభు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామీజీ, ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అయోధ్య నగర మేయర్ గిరీష్ పతి త్రిపాఠి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం సునీతా మహేందర్ రెడ్డి హాజరయ్యారు. వారు సీతారాముల వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆలయ పూజారి సత్యనారాయణ దాస్‌జీతో పాటు తెలంగాణకు చెందిన పూజారులు విశ్వనాథ్ రాజు, మణిదీప్, సుకేష్ శర్మ, రాంబాబు సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కొలన్ మౌనిక బాల్ రెడ్డి, మణిద్వీప్, రవికిరణ్, సత్యనారాయణ రాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రోటోకాల్ అధికారులు వారికి బాల రాముల వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మం వర్ధిల్లాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు.



# పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

### - సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 26(ప్రజా వీక్షణం):**

కొత్తగూడెం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ అన్నారు. బుధవారం బూడిదిగడ్డ ఉన్నత పాఠశాలలో సిపిఎం ప్రతినిధులు సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు బాత్రూమ్స్ టాయిలెట్స్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లే గ్రౌండ్ ఉన్నప్పటికీ వర్షాకాలంలో వరద నీరు నిలవడం వల్ల ఆడుకోలేని స్థితి ఏర్పడిందని అన్నారు. మూత్రశాలల వద్ద బయటికి పోతున్న నీరు వల్ల దుర్గంధంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం పాఠశాల అధ్యాపకులకు ప్రజలకు ఘర్షణలు అవుతున్నాయని ఈ సర్వేలో వాస్తవాలు బయట పడ్డాయి అన్నారు. పేద విద్యార్థులు కష్టపడి చదువుతున్న సమయంలో ఇటువంటి సమస్యల సుడిగుండంలో ఎలా చదువుకుంటున్నారని అర్థంకాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రజాప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ దృష్టికి మరి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన ఉండటం లేదని సర్వేలో వాస్తవాలు బయటికి వచ్చాయని రమేష్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసిన ఓట్లతో గెలిచిన పాలకవర్గాలు ప్రజాప్రతినిధులు విద్యార్థుల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకొని వారి ఆరోగ్యాలు చదువు నడవడిక కూడా అభివృద్ధి పదంలో నడిపించాల్సిన గురు తల బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని రమేష్ అన్నారు. మూత్రశాలలు బాత్రూమ్స్ వల్ల వస్తున్న దుర్గంధం బయట



సరైనటువంటి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ దుర్గంధంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెంటనే నిధులు కేటాయించి సౌకర్యాలను మెరుగు పరచాలని సీపీఎం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఇదే పద్ధతిలో విద్యార్థుల పట్ల ప్రభుత్వ పాఠశాల పట్ల నిర్లక్ష్యం వాయిస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాడుగుల ప్రభాకర్, రాజ్ కుమార్, స్వచ్ఛ మిత్రా నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రేగులకుంటలో విషాదం.. సోడెం బుచ్చన్న కుటుంబాన్ని పరామర్శించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

### - ఆ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే భరోసా

### - బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన నాయకులు

**బుట్టాయిగూడెం, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ పరిధిలోని బుట్టాయిగూడెం మండలం రేగులకుంట గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సోడెం బుచ్చన్న ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబంలో అంతులేని శోకం అలుముకుంది. ఈ దుఃఖకర వార్తను తెలుసుకున్న పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు చలించిపోయారు. బుధవారం ఉదయం హుటాహుటిన రేగులకుంట గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, నేరుగా సోడెం బుచ్చన్న నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా మృతుడు సోడెం బుచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి, వారిని అక్కున చేర్చుకుని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న బుచ్చన్నను కోల్పోయి రోదిస్తున్న కుటుంబ సభ్యులను చూసి ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడొద్దని, తాను వ్యక్తిగతంగానూ, అలాగే కూటమి ప్రభుత్వం తరపున ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా



కల్పించారు. ప్రభుత్వపరంగా అందవలసిన సహాయసహకారాలన్నింటినీ తక్షణమే అందిస్తామని వారికి మాటిచ్చారు. ఎమ్మెల్యే చూపిన మానవత్వం, అందించిన ధైర్యం చూసి బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక కూటమి నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పుడూ ముందుండే ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఇలాంటి ఆపద సమయాల్లో కూడా ప్రజల వెంటే ఉంటూ ధైర్యం చెప్పడం అభినందనీయమన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కూటమి ప్రముఖ నాయకులు పూనెం రాజా, కరాటం సతీష్, సింగులూరి ఏసుబాబు, మారిశెట్టి అనిల్, ఫణి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతునికి నివాళులర్పించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# బాచుపల్లి ఆకృతి కన్స్ట్రక్షన్‌పై పోలీస్ కేసు నమోదు

## రోడ్డు స్థలాన్ని ఆక్రమించారన్న రెవెన్యూ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్

## ప్రభుత్వ స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపించి అనుమతులు పొందారన్న ఆరోపణలు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26, (ప్రజా వీక్షణం) :**

రోడ్డు స్థలాన్ని ఆక్రమించి వినియోగించారన్న ఆరోపణల నేపథ్యంలో బాచుపల్లిలోని ఆకృతి కన్స్ట్రక్షన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు గత నెలలో బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఈ నెల 24న పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 777/2026 నమోదు చేసినట్లు సమాచారం. ఆకృతి కన్స్ట్రక్షన్ నిర్మాణాలకు సంబంధించి అప్రోచ్ రోడ్డుగా చూపిస్తున్న స్థలం ప్రభుత్వానికి సంబంధించినదని, దానిని ఆక్రమించి వినియోగిస్తున్నారన్న అంశంపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

1. District Cyberabad P.S. Bachupally Year 2026 FIR No. 777/2026 Date 24-08-2026
2. Acts & Section(s): 329(3) BNS
3. a) Occurrence of Offence: Day Monday Date & Time From
Date & Time To Prior To 24-08-2026 15:00:00 Time Period
b) Information Received at P.S.: Date & Time 24-08-2026 16:00:00
General Diary Reference: Entry No 15 Date & Time 24-08-2026 16:00:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 0.3 km, South Beat No.
b) Address Place At Sy.No.454 of Bachupally Village, Area/Mandal Bachupally Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name G.V. Malleswara Rao
b) Father's /Husband's Name
c) Date/Year of Birth Age 44 Years
d) Nationality India e) Caste Others
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Govt. official Gazetted Mobile No. 9963668599
h) Address House No Bachupally Area/Mandal Bachupally Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name Akruthi Constructions Builders
b) Father's /Husband's Name
c) Occupation Male

దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కేసులో పేర్కొన్న ఆరోపణలు, సంబంధిత భూమి హక్కులు, నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై గతంలో తాను పోరాటం చేశానని పేర్కొన్న ఆకుల సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అప్రోచ్ రోడ్డుగా చూపిస్తూ నిర్మాణాలకు అనుమతులు పొందుతున్నారన్న అంశాన్ని తాము గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పుడు రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీస్ కేసు నమోదు కావడం తమ పోరాటానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆకృతి కన్స్ట్రక్షన్



వ్యవహారంపై ప్రశ్నించినందుకు తమపై అక్రమ కేసులు పెట్టారని ఆకుల సతీష్ ఆరోపించారు. ప్రస్తుత ఎఫ్ఐఆర్ నమోదు ఆ ఆరోపణలకు సమాధానంగా నిలుస్తుందని, తమకు ఇది చెంపదెబ్బ లాంటిదని వ్యాఖ్యానించారు. అయితే గతంలో నమోదైన కేసుల వివరాలు, వాటి చట్టపరమైన స్థితిపై సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

### ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

వివాదానికి కేంద్రంగా ఉన్న అప్రోచ్ రోడ్డు స్థలాన్ని రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి, అది ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే వెంటనే తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. భూమి రికార్డులు, సర్వే వివరాలు, నిర్మాణ అనుమతులు, అప్రోచ్ రోడ్డు కోసం చూపిన స్థలం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఇప్పటికే పోలీస్ కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కావడం ఆరోపణలు రుజువైనట్లు కాదని, దర్యాప్తు పూర్తయి సంబంధిత అధికారులు వెల్లడించే వాస్తవాలు, భూమి రికార్డులు, అనుమతుల వివరాల ఆధారంగానే తుది నిర్ధారణకు రావాల్సి ఉంటుంది.

# మదర్ థెరిసా జయంతి సందర్భంగా చిలకలూరిపేటలో విగ్రహావిష్కరణ

**చిలకలూరిపేట : ఆగష్టు 26 ( ప్రజా వీక్షణం )**

చిలకలూరిపేట పట్టణంలోని రైతుబజార్ సెంటర్‌లో శ్రీ సాయి వెంకటేశ్వర కాంపౌండర్స్ మరియు నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా విగ్రహాన్ని చిలకలూరిపేట శాసనసభ్యులు,మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కొండ్రముట్ల నాగేశ్వరావు, గుంటుపల్లి నరసింహారావు,అనపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశిష్ అతిధులుగా తోట రాజా రమేష్, దేగల ప్రభాకర్,మండలనేని చరణ్ తేజ,షేక్ కరీముల్లా,షేక్ రఫాని,మద్దుల వెంకట కోటయ్య యాదవ్,బాదుగున్నల శ్రీను,బి శ్రీను నాయక్,చెన్నకేశవుల రాంబాబు తదితరులు పాల్గొని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పేదలు,అనాథలు, నిరుపేదలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవ చేయడమే జీవిత ధ్యేయంగా మదర్ థెరిసా సాగించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ఆమె చూపిన సేవా మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు.



# నందిగామలో మానవత్వం చాటుకున్న బీజేపీ రాష్ట్ర మైనారిటీ నాయకులు బిజెపి సైదా... అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి రూ. 25 వేల ఆర్థిక సహాయం!

**నందిగామ, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన బాలుడు షేక్ బాజీ అరుదైన ఏయింగ్ సరకమా వ్యాధితో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. 2016లో జన్మించిన ఈ బాలుడు 2024లో ఈ ప్రాణాంతక వ్యాధి బారిన పడినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో నివసిస్తున్న బాలుడి తల్లి షేక్ షయినాజ్... కొడుకు వైద్యం కోసం ఉన్నదంతా ఖర్చు చేయడంతో ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ బాలుడి దయనీయ పరిస్థితి గురించి తెలుసుకున్న బీజేపీ పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకులు బిజెపి సైదా వెంటనే స్పందించారు. మానవతా దృక్పథంతో బాజీ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి వైద్యం నిమిత్తం తన వంతు సహాయంగా రూ. 25,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ ఆపత్కాలంలో తమను ఆదుకున్న బిజెపి సైదాకు బాలుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాజీ మెరుగైన వైద్యం కోసం ఇంకా మరింత ఆర్థిక సహాయం అవసరమని, దాతలు మరియు సేవా సంస్థలు ముందుకు వచ్చి ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.




# మానవతా సేవకు ప్రతీకగా రక్తదాన శిబిరం: ప్రతిభ స్కూల్ శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ (హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరం మానవతా సేవకు ప్రతీకగా నిలిచింది. పట్టణంలోని ప్రతిభ హైస్కూల్ వేదికగా స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈ శిబిరాన్ని సందర్శించి, ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న యువతను మరియు దాతలను ఆమె అభినందించారు. అత్యవసర సమయాల్లో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో విలువైన సేవ అని, సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. ప్రవక్త ముహమ్మద్ బోధించిన ప్రేమ, దయ, కరుణ, సేవా భావాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మత సామరస్యానికి, మానవ సేవకు ఈ శిబిరం చక్కని నిదర్శనమని ఆమె కొనియాడారు. ఉదయం ప్రారంభమైన ఈ శిబిరంలో కొద్ది గంటల్లోనే 24 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక అభినందన సర్టిఫికెట్లు అందజేశారు. సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం దిగ్విజయంగా కొనసాగింది. ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రతిభ స్కూల్ నిర్వాహకులను, ముస్లిం మత పెద్దలను, ఏర్పాట్లలో పాలుపంచుకున్న కూటమి నాయకులను మరియు ఉత్సాహంగా పాల్గొన్న యువ రక్తదాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ మత పెద్దలు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రతిభ విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు

**బాపట్ల : ఆగస్టు 26 ( ప్రజా వీక్షణం )**



జిల్లాలోని వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతి నెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు జిల్లాలోని 68,297 మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు చౌక ధరల దుకాణ డీలర్ల ద్వారా వారి ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాపట్ల పట్టణంలోని రైలుపేటలో ఓ వృద్ధురాలి ఇంటికి వెళ్లిన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీ ఏ. జగన్మోహన్ రావు స్వయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఇంటి వద్దకే సరుకులు అందుతున్న తీరును పరిశీలించి,వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వయోభారం,దివ్యాంగత్వం కారణంగా చౌక ధరల దుకాణాలకు వెళ్లలేని వారికి ప్రభుత్వం చేపట్టిన ఈ ఇంటి వద్ద సరుకుల పంపిణీ ఎంతో ఉపయోగకరంగా ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యత.. రుచి.. పరిశుభ్రతే వ్యాపార విజయానికి బాట

## రామయ్య మెస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజా వీక్షణం)**

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామయ్య మెస్ ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన రామయ్య మెస్ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని సూచించారు. స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యత, రుచి, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే వ్యాపారంలో మంచి గుర్తింపు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మెస్ నిర్వాహకులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు

**కుమ్రం భీమ్ ఆసిఫాబాద్,ఆగస్ట్26( ప్రజా వీక్షణం ):**

జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్ర వరద పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపు నీటితో జిల్లాలోని చెరువులు, కాలువలు పూర్తిస్థాయిలో నిండడమే కాకుండా, వాగులు , వంకలు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో చింతల మానేపల్లి మండలంలోని దిందా, కేతుని గ్రామాల మధ్య ఉన్న లో-లెవల్ వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణాలకు తెగించి దాటవద్దని అధికారులు ఎంత హెచ్చరిస్తున్నప్పటికీ, పరిస్థితుల తీవ్రతను గమనించకుండా రోడ్లు దాటే ప్రయత్నాలు చేయడం వల్ల తీవ్రమైన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

## - సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు

**భద్రాద్రి, కొత్తగూడెం, ఆగస్టు 26(ప్రజా వీక్షణం):**

పాత కొత్తగూడెం పరిధిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. సిపిఎం పాత కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను బుధవారం అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా లిక్కి బాలరాజు మాట్లాడుతూ ప్రధానంగా పాత కొత్తగూడెం పరిధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని డ్రైనేజీలు సక్రమంగా తీయకపోవడం వలన చెత్త మురుగునీరు పేరుకుపోయి దోమలు విపరీతంగా వస్తున్నాయని తెలిపారు. దోమ కాటు వలన ప్రజలకు మలేరియా డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అందుకని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. కిన్నెరసాని మంచినీరు ప్రతిరోజు రాకపోవడం వలన మంచినీళ్లకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోతులు వీధి కుక్కల బెడద వలన ప్రజలు ఇళ్లలోంచి బయటికి రావడానికి భయపడుతున్నారని అందుకని కోతులు వీధి కుక్కలను పట్టించి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు మంద నాగకృష్ణ నాయకులు ఎస్కే సాహిబి కల్లాకుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
27 గురువారం ఆగస్టు 2026
9
www.prajaveekshanam.in

# భూ సేకరణ పరిహారంలో కోత విధించే జీవో 470 తక్షణమే రద్దు చేయాలి.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.

ఏలూరు ఆగస్టు 26:(ప్రజా వీక్షణం)

2013 భూ సేకరణ చట్టం కింద భూసేకరణ సందర్భంలో పరిహారం లెక్కించే విషయంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే తక్కువ పరిహారాన్ని నిర్ణయించి అమలు చేస్తున్నదని,దానికి తోడు కొత్తగా తెచ్చిన జీవో 470 రైతుకు మరింత నష్టం కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో భూసేకరణ జీవో 470పై ఆయన మాట్లాడారు.జీవో 470ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి సంబంధించిన రైతులు తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయంగా ఇవ్వాల్సిన పరిహారం గురించి హైకోర్టుకు వెళ్ళగా, హైకోర్టు రైతులకు అనుకూలంగా 2019 సంవత్సరంలో తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపల్ పట్టణాలు, నగర పంచాయతీలకు 2 కిలోమీటర్లకు లోపల ఉండే భూములకు కేవలం 5%, రెండు నుండి ఐదు కిలోమీటర్ల మధ్యలో ఉండే భూములకు 10%, ఐదు కిలోమీటర్లు దాటి ఉండే భూములకు 25% ఇచ్చేలా జీవో నెంబర్ 470 ని జారీ చేసిందన్నారు. ఇది భూములు కోల్పోయే రైతులకు గతంలో ఉన్న అదనపు పరిహారం 25% పొందే న్యాయమైన హక్కును తిరస్కరిస్తున్నదన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కంటే భూసేకరణ పరిహారం తక్కువగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందులోనూ కోత పెట్టి రైతులకు మరింత ఎక్కువ నష్టం కలిగించే వైఖరిని తీసుకున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఒకసారి భూమి కోల్పోయిన రైతు ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో బయట మార్కెట్లో తిరిగి భూమి కొనగలిగిన పరిస్థితి ఉండటం లేదన్నారు. అటువంటి స్థితిలో రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి రైతులకు ధైర్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా ప్రభుత్వ భూ సేకరణలో తక్కువ నష్టపరిహారం ఇచ్చేందుకు జీవో 470 తీసుకురావడం ప్రభుత్వం యొక్క రైతు వ్యతిరేక స్వభావాన్ని వెల్లడిస్తున్నదని చెప్పారు. భూసేకరణ పరిహారం విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 470 ని తక్షణమే రద్దు చేయాలని రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ప్రభుత్వ యొక్క ఈ రైతు వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా ఆందోళన, పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.




# మిలాడ్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్మోహనరావు

## మానవాళికి మహమ్మద్ ప్రవక్త జీవితం స్ఫూర్తిదాయకం

## నందిగామలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

నందిగామ, ఆగస్టు 26 (ప్రజా వీక్షణం):

మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన పవిత్ర మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని, ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సౌభ్రాతృత్వం మరియు ధర్మానికి సదా స్ఫూర్తిదాయక ప్రతీక అని కొనియాడారు. తోటి ప్రజలకు విశ్వాసం, నమ్మకం, శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడే ప్రవక్త ఆశయాలు నిజంగా నెరవేరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రవక్త దయ, కరుణ బోధనలు ఈ పవిత్రమైన రోజున మనందరికీ గుర్తుకు వస్తాయని తెలిపారు. పట్టణంలోని ముస్లిం సోదరులందరికీ ఆయన హృదయపూర్వక మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఈ పవిత్ర దినం ప్రజలందరిలో శాంతి, సద్భావన మరియు సోదరభావాన్ని మరింత పెంపొందించాలని మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ఈ పర్వదినాన్ని విజయవంతం చేశారు.



# దేవాలయంలో కొనసాగుతున్న అఖండ భజన..

దేవరకద్ర. ఆగస్టు 26ప్రజా విక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా అఖండ దీపారాధన, మరియు భజన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో ప్రతి సంవత్సరం స్వామివారి ఆలయంలో 41 రోజులపాటు అఖండ దీపారాధన పెట్టడం అనావాతిగా వస్తున్నది అని అర్చకులు తెలిపారు. దీపారాధన భజన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే శ్రావణమాసం 14వ రోజు బుధవారం రాత్రి ఆలయంలో శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అలంకరణ వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి . ఆలయంలో అఖండ దీపారాధన వెలిగించరు.భజన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు , భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో చిన్నారుల సందడి...

## దేవరకద్ర, కౌకుంట్ల మండలలలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు...

దేవరకద్ర,ఆగస్టు 26 ప్రజా విక్షణం

మీలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం నియోజకవర్గ పరిధిలో కౌకుంట్ల మండల కేంద్రంలో నిర్వహించిన ఊరేగింపులు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవరకద్ర, కౌకుంట్ల, మండలాలలో ముస్లిం సోదరులు, చిన్నారులు, భక్తిశ్రద్ధలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు వలైహి వసల్లం బోధించిన శాంతి ,సోదర భావం, మానవత్వం సేవ స్ఫూర్తి సందేశాలను వివరించారు. అనంతరం పలుచోట్ల అన్నదానం, మిఠాయిల పంపిణీ చేపట్టారు.




# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు.





## కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి.

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారు,

నిజామాబాద్ ఆగస్టు 26 , ప్రజా వీక్షణం

ప్రతినిధి:

నిజామాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగగా, అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

### మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: షబ్బీర్ అలీ..

సభలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు .కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకో వద్దని ఆయన పిలుపునిచ్చారు .తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, కరుణ, సహనం, సోదరభావం మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని షబ్బీర్ అలీ అన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు.తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయం

## తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజా వీక్షణం)

పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) కొనియాడారు. తాడేపల్లిగూడెం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య సేవా సంస్థ వ్యవస్థాపకులు దాట్ల ఆంజనేయరాజు తల్లిదండ్రులు వెంకటపతి రాజు, లక్ష్మి నరసాయమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. నిర్మాత, ఎం.ఎస్. రాజు సౌజన్యంతో ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు.వృద్ధులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న దాతలు, నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి సత్యనారాయణ, ఆలపాటి నాగేశ్వరరావు, జాస్తి శేషారావు, కారంకి గంగయ్య, సుబ్బరాజు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక

# బద్దిపల్లిలో 9 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

**కొత్తపల్లి మండలం ఆగస్టు 26( ప్రజా వీక్షణం )**

తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా 9 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిశాల రాజేందర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాస్ గౌడ్ కృషితో ఈ మంజూర్లు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర శ్రీనివాస్, ఉపసర్పంచ్ వైద తిరుపతి, రాచమల్ల స్రవంతి–రాజిరెడ్డి, తాండ్ర కవిత–మహేందర్, మేడి మంగ–చంద్రయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని గణేష్, గ్రామ ప్రధాన కార్యదర్శి రాజకుమార్,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తాండ్ర తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

**కమాన్ పూర్ ప్రజా వీక్షణం ఆగస్టు 26.**

రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో బుధవారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థలో అమలులో ఉన్న ఎల్ 1, ఎల్ 2, విధానం కారణంగా ఓ.బి, అండర్ గ్రౌండ్ సివిల్ పనులలో, పరికరాల పని ముట్లలో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయని, ప్రస్తుత ఎల్ 1, ఎల్ 2, పూర్తిగా పునః సమీక్షించి, నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా అమలు చేయడం, సింగరేణి వ్యాప్తంగా ఒకరి క్వార్టర్ లో మరొకరు ఉంటున్నారని అన్ని క్వార్టర్లను క్రమబద్రికరించి ఎవరైతే క్వార్టర్లో ఉంటున్నారో వారికి పర్మనెంట్ చేయడం, ఐ ఈ డి లెక్కల ప్రకారం అడ్జలా లాంగ్వాల్ గనిలో అదనంగా ఉన్న ఎలక్ట్రీషన్, ఫిట్టర్ లను, ఘనంగా ఉన్న సిబ్బందిని అవసరానికి అనుగుణంగా ఓ సి పి 1, ఓసిపి–2 లకు బదిలీ చేయడం, సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ నిర్మించి చాలా కాలం అవుతున్న కారణంగా తరచూ మరమ్మత్తులు అవుతున్నాయి కాబట్టి సివిల్ విభాగం కు తగినంత మాన్ పవర్ ను ఇచ్చి క్వార్టర్ల మరమ్మత్తులను సకాలంలో చేపట్టేలా చర్యలను తీసుకోవడం, ఓసిపి–1 ఎస్ అండ్ డి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ద్విచక్ర వాహన పార్కింగ్ కోసం షెడ్డు ను నిర్మించడం, ఆర్ జి త్రీ, ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అర్జీ –2 ఏరియా లోనీ ఉద్యోగులతో సమానంగా క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించడం, ఇష్టం లేని పదోన్నతి వద్దని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని పదోన్నతి రద్దుచేసి వారిని యధా ప్రకారం వారి డెసిగ్నేషన్ లలో కొనసాగించడం, ఓసిపి–1 ఉత్పత్తి, రోజువారి కార్యకలాపాలకు అవసరమైన స్థాయిలో డోజర్ లను అందుబాటులో ఉంచడం, వర్షపు నీరు నిలవడం వల్ల సిహెచ్పీ కాంట గేట్ ప్రాజెక్ట్ ఆఫీస్ గేటు వరకు గల రహదారి, కాంపౌండ్ ఫెన్సింగ్ వెంబడి ఉన్న సైడ్ డ్రెయిన్ క్లియర్ చేయడం, వర్షపు నీరు సక్రమంగా వెళ్లి పోయేలా చర్యలు తీసుకోవడం, సెంటినరీ కాలనీలో కోతులు, వీధి కుక్కలు, పందుల బెడద విపరీతంగా పెరిగిందని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నియంత్రణకు తక్షణ, శాశ్వత చర్యలు తీసుకోవడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జి.తిరుపతి, కె.సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస రావు, ఎస్వో టుజియం యం .రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు కె.జనార్ధన్, జి.శంకర్, ఐ ఇ డిజిఎం బి.టి. మురళీకృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజినీర్ ప్రకాష్, సిహెచ్పి డిజియం జి.శ్రీనివాస్, ఐ టి డిప్యూటీ మేనేజర్ ఆర్.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ

**కరీంనగర్ ఆగస్టు 26( ప్రజా వీక్షణం )**

కరీంనగర్‌లో మార్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో అజీమ్–ఓ– షాన్ మిలాద్–ఉన్–నబీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ముంబై స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నాకా చౌరస్తా, మొహమ్మదీ మసీదు, సివిల్ హాస్పిటల్ రోడ్ మీదుగా సవారణ్ మసీదు వరకు కొనసాగింది. అనంతరం జోహార్ నమాజ్ తర్వాత గీతా భవన్ చౌరస్తా, బస్ స్టాండ్, అస్లాం మసీదు మీదుగా కరీముల్లా షా సాహెబ్ దర్గా వద్ద ముగిసింది. ర్యాలీలో మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసిన్, సిటీ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు అహ్మద్ అలీ, అర్షద్ అలీ, కమిటీ బాధ్యులు హాజీ ఖాన్, హబీబుద్దీన్, హాజీ అబ్దుల్ రెహ్మాన్, జమీల్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీస్ కమిషనర్ ఘౌస్ ఆలమ్, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. అంజన్ కుమార్ తదితరులు ర్యాలీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ప్రేమ, సోదరభావ మార్గంలో ప్రజలు నడవాలని పిలుపునిచ్చారు. వేలాది మంది పాల్గొన్న ఈ ర్యాలీ శాంతి, సోదరభావం సందేశాన్ని చాటింది.





# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌వన్నీ కుట్రలేనని తేలింది

- ప్రాజెక్టును నిర్వీర్యం చేయాలని చూసిన రేవంత్‌రెడ్డి

-కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది

-కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంకనే మళ్లీ వలసలు మొదలైనయ్

-మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , ఆగస్టు 26:**

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీ చేసినవన్నీ కుట్రలేనని తేలిపోయిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. బుధవారం మంథని మండలం సిరిపురం గ్రామంలోని సుందిళ్ల బ్యారేజ్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ తోకలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం పుట్ట మధు మాట్లాడుతూ కేసీఆర్ నైపుణ్యతపై కాంగ్రెస్ పార్టీ మూడు సంవత్సరాలుగా చేసిన కుట్రలను వాటర్ పవర్ సెంట్రల్ రీసెర్చ్ స్టేషన్, ఎన్‌డీఎస్‌ఏ బృందం పటాపంచలు చేస్తూ హైకోర్టుకు నివేదికలు అందించిందని ఆయన తెలిపారు. కాళేశ్వరంపై చేసిన ఆరోపణలు ఏవీ నిజం కాదని నిర్తారణ అయిందన్నారు. అతి పెద్ద ప్రాజెక్టును నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తే రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేయాలని ముఖ్యమంత్రి చూస్తున్నాడని ఆయన విమర్శించారు. తండ్రి కొడుకులు ఈ నియోజకవర్గంలో అనేక ఏండ్లు పాలించి ఒక్క చెక్ డ్యాం, ఒక్క బ్రిడ్జి కట్టలేదని, అదే కేసీఆర్ హాయాంలో తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో బొక్కలవాగుపై చెక్‌డ్యాంలు, గోదావరిపై బ్రిడ్జిలు నిర్మించామని గుర్తు చేశారు. 150కిలో మీటర్ల విస్తీర్ణంలో నిండుకుండలా సముద్రాన్ని తలపించేలా ఉన్న గోదావరినదిని రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు నిర్వీర్యం చేయాలని ఏడారిని తలపించేలా చేశారని ఆయన అన్నారు. ఆనాడు ప్రాజెక్టు ద్వారా మత్స్య సంపద పెరిగిందని, గ్రౌండ్ వాటర్ పెరిగి సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని ఆయన వివరించారు. ఒకప్పుడు బతుకు దెరువు కోసం దుబాయ్‌లాంటి దేశాలకు వలసపోయిన బెస్తపల్లి వాసులు ప్రాజెక్టు నిర్మాణంతో మత్స్య సంపద పెరిగి ఇక్కడికే వచ్చారని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బరాజ్‌లో నీటిని నిల్వ చేయకపోవడంతో ఉపాది లేక వలసబాట పట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో నీళ్లు నిలిపే అంశం ప్రభుత్వం మీద ఉందని దాన్ని మేం వ్యతిరేకిస్తలేమని సెంటర్ వాటర్ రిసెర్చ స్టేషన్, ఎన్‌డీఎస్‌ఏ బృందం చెప్తున్నా కానీ సుందిళ్ల బ్యారేజీకి ఏమీ కాకున్నా నీళ్లు ఆపకుండా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇంకా ప్రజలపై మమకారం పెరుగడంలేదన్నారు. కేవలం ఢిల్లీకి మూటలు మోసుకుపోవడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచించడం లేదని ఆయన విమర్శించారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రతి వర్గం కోసం పని చేశారని, అందుకే మంచి ఫలితాలు వచ్చాయని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బరాజ్‌ల గేట్లు మూసి నీళ్లు ఆపాలని, లేనిపక్షంలో ప్రజలే నీళ్లు ఆపుకునే రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అస్వస్థతకు గురైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపికి పరామర్శ

**కర్నే బాబురావు ( ప్రజా వీక్షణం ) భద్రాద్రి జిల్లా స్టాపర్ ఆగస్టు : 26**

మణుగూరు పట్టణంలోని ప్రగతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపిని రేణుకా అక్షర మహిళా మండలి సభ్యులు బుధవారం పరామర్శించారు.గురిజాల గోపి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మహిళా మండలి సభ్యులు ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యంగా ఉండాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ చికిత్స తీసుకోవాలని సూచించారు.గురిజాల గోపి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని రేణుకా అక్షర మహిళా మండలి సభ్యులు ఆకాంక్షించారు.



# SIR ఫేజ్-2 శిక్షణ తరగతులు

మన బూతులో మన ఓట్లను కాపాడుకుందాం.

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**ప్రజా వీక్షణం ,గోదావరిఖని:**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) ఫేజ్–2 ప్రక్రియలో భాగంగా బుధవారం గోదావరిఖనిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, దీపక్ రాథోడ్ ప్రభాకర్ రెడ్డి, ఫహీం, పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. SIR ఫేజ్–2 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, అనర్హులు లేదా మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సవరణలు చేపట్టాలని అన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా SIR ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని కోరారు. దుద్దిళ్ల శ్రీనుబాబు, మాట్లాడుతూ.. SIR ఫేజ్–2 శిక్షణలో అందిస్తున్న మార్గదర్శకాలను సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేట ర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
27 గురువారం ఆగస్టు 2026
www.prajaveekshanam.in




# గెలుపు ముంగిట భారత్!

## - తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290- ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక
## - 16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక- సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది.అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉడానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.




# ఆసియా గేమ్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

## సెప్టెంబర్ 18న టీమ్ఇండియా మహిళలు మొదటి మ్యాచ్

2026 ఆసియా గేమ్స్? నుంచి అదిరే అప్డేట్ వచ్చింది. జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్?లో క్రికెట్ పోటీలకు సంబంధించిన షెడ్యూల్? విడుదలైంది. ముందుగా మహిళల జట్ల మధ్య పోటీలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురుషుల కాంపిటీషన్ ఉండనుంది. ఈ మ్యాచ్?లన్నింటినీ జపాన్?లోని కొరోగి అథ్లెటిక్ పార్క్?లో నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్ పోటీల్లో భారత్, శ్రీలంక, జపాన్, మలేసియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, థాయ్?లాండ్? జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్?లు సెప్టెంబర్ 17న షురూ కానుండగా, టీమ్ఇండియా మహిళలు తమ మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 18న ఆడనుంది. ఈ మ్యాచ్ జపాన్‌తో జరగనుంది.ఆ తర్వాత 20, 22 తేదీల్లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్?లు నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 22న జరుగుతుంది, అలాగే కాంస్య పతక పోరు కూడా అదే రోజు ఉంటుంది. ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. గత సీజన్?లో గోల్డ్ మెడల్ సాధించిన టీమ్ఇండియా మరోసారి అదే ప్రదర్శనను రిపీట్ చేయాలని ఆశిస్తోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్?తోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో నేరుగా అర్హత సాధించాయి. ఈ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతాయి. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, జపాన్, నేపాల్ టీమ్స్?ను 'గ్రూప్‌-సీ'లో ఉంచారు. హాంకాంగ్, చైనా, మలేసియా, ఒమన్ జట్లను 'గ్రూప్ డీ'లో చేర్చారు. ఈ గ్రూపులలో విజేతలుగా నిలిచిన జట్లు, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో తలపడతాయి. గ్రూప్ స్టేజ్?లో ఓడిపోయిన జట్లు పోటీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభమవుతాయి. ముందుగా గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని జట్లు పోటీపడతాయి. ఆ తర్వాత భారత 28న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే అది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కాబట్టి ప్రత్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. అయితే శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్ఇండియా ఈ పోటీలో ఆడనుంది. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చెమటోడుస్తున్న ప్లేయర్లు

టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్-బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని.. ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే.. త్వరలోనే భారత వైట్-బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# టాప్ లేపిన మిచెల్ స్టార్క్, రిషభ్ పంత్!

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో

ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ దుమ్మురేపాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కినెట్టి మిచెల్ స్టార్క్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ 872 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్లు పడగొట్టిన స్టార్క్.. రెండు స్థానాలు ఎగబాకి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బాల్‌కే మిచెల్ స్టార్క్ వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఇద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ తృటిలో శతకాన్ని చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శనతో రిషభ్ పంత్(711) ఆరు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి వచ్చి 8వ ర్యాంకు అందుకోగా.. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన శుభ్‌మన్ గిల్(711)8వ స్థానానికి పడిపోయాడు. రెండు టెస్ట్‌ల్లో విఫలమైన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(874), జో రూట్(850), స్టీవ్ స్మిత్(840), ట్రావిస్ హెడ్(811), టెంబా బవుమా(775) టాప్-5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా(428)తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. శ్రీలంకతో తొలి టెస్ట్‌లో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



# 44 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టిన సోనాల్ దినుషా

శ్రీలంక యువ బ్యాటర్ సోనాల్ దినుషా భారత జట్టుపై అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించాడు. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో 103 పరుగులతో సెంచరీ బాది, టీమిండియాపై తన తొలి రెండు టెస్టుల్లోనూ సెంచరీలు సాధించిన రెండో శ్రీలంక ఆటగాడిగా 44 ఏళ్ల నాటి రికార్డును సమం చేశాడు. టీమిండియా బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ సోనాల్ దినుషా టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర లిఖించాడు. తన కెరీర్‌లో భారత్‌పై ఆడిన తొలి రెండు టెస్టుల్లోనూ శతకాలు సాధించిన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతకుముందు 1982లో శ్రీలంక దిగ్గజ ఆటగాడు దులీప్ మెండిస్ మాత్రమే ఈ సాధన చేశాడు. సుదీర్ఘమైన 44 సంవత్సరాల విరామం తర్వాత ఆ ఘనతను సాధించిన రెండో లంక ఆటగాడిగా దినుషా రికార్డులకెక్కాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో భారత్‌పై తమ తొలి రెండు టెస్టుల్లో సెంచరీలు చేసిన ఎనిమిదో బ్యాటర్‌గా కూడా నిలిచాడు. ఈ సిరీస్‌లో దినుషా బ్యాటింగ్ శైలి భారత బౌలర్లకు పెద్ద సవాలుగా మారింది. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 100 పరుగులు చేసిన ఆయన, తర్వాతి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేసి కొద్దిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఇప్పుడు కొలంబో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులతో మరో శతకాన్ని నమోదు చేశాడు. ఇప్పటివరకు ఆడిన మూడు ఇన్నింగ్స్‌ల్లో 95.67 అద్భుతమైన సగటుతో ఏకంగా 287 పరుగులు సాధించి తన సత్తా చాటాడు. టీమిండియాపై వరుస టెస్టుల్లో సెంచరీలు బాదిన ఏడో శ్రీలంక బ్యాటర్‌గా సోనాల్ దినుషా నిలిచాడు. గతంలో అరవింద డిసిల్వా, కుమార్ సంగక్కర లాంటి దిగ్గజాలు వరుసగా మూడు టెస్టుల్లో భారత్‌పై సెంచరీలు సాధించగా, సనత్ జయసూర్య, మహేళ జయవర్ధనే, తరంగ పరణవితాన, ఎంజెలో మాథ్యూస్ రెండు టెస్టుల్లో ఈ ఘనత సాధించారు. ఇప్పుడు వారందరి సరసన దినుషా స గర్వంగా చేరిపోయాడు. ప్రస్తుత 2026 సంవత్సరంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో దినుషా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఏడాది ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో 77 సగటుతో 462 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో 350 కంటే ఎక్కువ పరుగులు చేసిన అంతర్జాతీయ బ్యాటర్లలో అత్యుత్తమ సగటు కలిగిన ఆటగాడిగా దినుషా నిలవడం ఆయన నిలకడైన ప్రతిభకు నిదర్శనం.




# ఇరుముడి నిలిపివేతపై ప్రేక్షకుల ఆందోళన

నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్థానిక వెంకటరమణ థియేటర్ వద్ద బుధవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంతో ఆసక్తిగా తిలకించాలనుకున్న రవితేజ 'ఇరుముడి' చిత్రాన్ని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా నిలిపివేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ థియేటర్ గేటు ఎదురుగా బైఠాయించి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. గత రెండు రోజులుగా ఈ సినిమా కోసం జనం భారీగా పోటెత్తుతున్నారు. తమ సొంత పనులను సైతం పక్కన పెట్టి థియేటర్‌కు చేరుకుంటున్నప్పటికీ, టికెట్లు దొరక్క నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ప్రేక్షకులు వాపోయారు. కనీసం నేడైనా సినిమా చూసే అవకాశం ఉంటుందని ఆశతో వస్తే, ప్రదర్శన రద్దు చేశారన్న వార్త వారిని నిరుత్సాహానికి గురిచేసింది. అవసరమైతే నేలపై కూర్చుని లేదా నిలబడి అయినా సినిమా చూస్తామని, ఎంతటి రద్దీనైనా భరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో స్థానికంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# రోమాంచకం ట్రైలర్ విడుదల

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, 'మేమ్ ఫేమస్' చిత్రం ద్వారా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'రోమాంచకం' . భద్రకాళి పిక్చర్స్ మరియు ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సానిల్‌కుమార్ కథానాయకిగా నటిస్తుండగా, వాసుకి వైభవ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 3న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుండగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కేవలం సాధారణ ప్రేమకథా చిత్రంగా కాకుండా, నేటి ఆధునిక కాలంలోని డేటింగ్ యాప్స్, రిలేషన్‌షిప్స్ మరియు ఊహించని మలుపులతో కూడిన యూత్ ఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ట్రైలర్‌లో సుమంత్ ప్రభాస్ తనదైన తెలంగాణ నేటివిటీ యాసతో పాటు, తన మార్క్ కామెడీ అండ్ ఎనర్జిటిక్ నటనతో మరోసారి యువతను ఆకట్టుకునేలా కనిపించారు. మొదట ఎంతో సరదాగా, క్యూట్‌గా సాగే ఈ లవ్ స్టోరీ ఆ తర్వాత ఇంటెన్స్ ఎమోషన్స్, ఊహించని గొడవలు మరియు ఉత్కంఠభరితమైన మలుపులతో ఎలా సాగిందనే అంశాలను ట్రైలర్‌లో ఎంతో ఆసక్తికరంగా చూపించారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి ప్రెజెంట్‌గా వ్యవహరిస్తుండటంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.







# మరో మాఫియా డాన్ కథ

యశ్ టాక్సిక్ మూవీ విశ్లేషణ కేజీఎఫ్' ఫ్రాంచైజీ తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా అనగానే 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా అంచనాలు మొదలయ్యాయి. దానికి తగ్గట్టే ఈ సినిమా ప్రచార చిత్రాలు కూడా సినిమాపై ఆసక్తిని పెంచాయి. భారీ తారాగాణంతో, హాలీవుడ్ స్థాయి అత్యున్నత సాంకేతిక విలువలతో, ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో బుధవారం 'టాక్సిక్' విడుదలైంది. గంగా (నయనతార), రాయ(యశ్) అక్కాతమ్ముళ్లు. చిన్నతనంలోనే అమ్మానాన్న దూరం కావడంతో రాయను గంగే అమ్మగా మారింది. తన జీవితాన్ని పణంగా పెట్టి మరీ తమ్ముడ్ని పెంచి పెద్ద చేసింది. చిన్నతనం నుంచీ నేర ప్రపంచంలోనే పెరిగి పెద్ద కావడంతో ఇద్దరూ నేరప్రవృత్తితోనే ఎదుగుతారు. గోవా నేరసామ్రాజ్యానికి తన తమ్ముడ్ని అధిపతిగా చూడాలనుకుంటుంది గంగ. అందుకోసం అప్పటికే గోవాను ఏలుతున్న ఓ మాఫియా డాన్‌తో చేతులు కలుపుతుంది. ఆ గ్యాంగ్‌లో రాయ కీలకమైన వ్యక్తిగా ఎదుగుతాడు. మాఫియా డాన్ కూతురు రెబెక్కా(తార సుతారియా) రాయకు చేరువవుతుంది. ఇద్దరూ ఒకటవుతారు. మరోవైపు ప్రత్యర్థుల దాడులు, ప్రతిదాడులతో కథ సాగుతూ ఉంటుంది. ఇంతలో రాయకు రాయల్ సర్కస్‌లో పనిచేసే నాడియా(కియారా అద్వానీ) పరిచయం అవుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఇద్దరూ ఒకటవుతారు. ఈ క్రమంలో నాడియా గర్భవతి అవుతుంది. తన కూతురుని కాదని వేరొక అమ్మాయితో రాయా తిరుగుతున్నాడని తెలిసి మాఫియా డాన్ మండిపడతాడు. ఈ క్రమంలో జరిగిన కలామటీలో ఆ మాఫియా డాన్ రాయ్ చేతులో హతుడవుతాడు. అనుకోని పరిస్థితుల్లో శత్రువుల చేతుల్లో రాయా అక్క గంగ, రాయా ప్రేయసి నాడియా చిక్కుకుంటారు. కడుపులో ఉన్న బిడ్డను చంపుతామని బెదిరించి, నాడియా చేతులతోనే గంగను దండగులు చంపిస్తారు. అక్క చావుకు కారణమైన ప్రియురాలిని రాయ క్షమించాడా? శిక్షించాడా? నాడియా జీవితం ఎలాంటి మలుపు తీసుకున్నది? అక్క కోరిక ప్రకారం రాయా గోవా మాఫియా సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగాడా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కేజీఎఫ్'లో ఎలాగైతే నేర ప్రపంచంలో పెరిగి, డాన్‌గా ఎదుగుతాడో.. ఇందులోనూ దాదాపుగా అంతే. అదే ధోరణిలో కథ సాగింది. అందులో అమ్మ సెంటిమెంట్. ఇందులో అక్క సెంటిమెంట్. తప్పు చేసిన ఓ తండ్రి మానసిక వేదనే ఈ సినిమా కథ అని చెప్పొచ్చు. సినిమా ప్రథమార్థం సాధారణ మాఫియా సినిమాలా అనిపించినా, ద్వితీయార్థం మాత్రం కథ కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ మలుపుకు సంబంధించిన సంఘర్షణ ఆడియన్‌కి కొత్తగా అనిపిస్తుంది. ఏదేమైనా అసలు కథ కంటే యాక్షన్ అంశాలకే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు అనిపిస్తుంది. ఆద్యంతం నరుక్కోవడాలు, చంపుకోవడాలు, కాల్చుకోవడాలు, మధ్య మధ్య ఇంటిమేటెడ్ సీన్స్. కుటుంబ ప్రేక్షకులకు కలిసి చూసేలా అయితే సినిమా లేదు. యశ్ ఇందులో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశాడు. యశ్ అక్క గంగగా నయనతార కథలో ప్రాధాన్యత గల పాత్రను పోషించింది. ఇందులో ఆమె యాక్షన్ సీక్వెన్స్ కూడా అదరగొట్టింది. ఇక కియారా అద్వానీ భావోద్వేగపూరితమైన పాత్ర పోషించింది. చక్కగా అభినయించింది. తారా సుతారియా, రుక్మిణీ వసంత్ పాత్రలు గ్లామర్‌కే పరిమితం అయ్యాయి. చెప్పుకోదగ్గ కథ కాదు. మేకింగ్ మాత్రం బావుంది. గీతూ మోహన్‌దాస్ స్క్రీన్‌ప్లేను అర్థం చేసుకోవడం సగటు ప్రేక్షకుడికి కష్టమే. మొత్తం కథ, కథనం విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుంటే బావుండేది. నిర్మాతలు డబ్బులు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. ఖర్చుపెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. ఇక రవి బస్రూర్ నేపథ్య సంగీతం బావుంది. కెమెరా వర్క్ కూడా బావుంది. మొత్తంగా సాంకేతికంగా సినిమా బావుంది.

# తమన్నా నటిస్తున్న ది వీవాన్ టీజర్ విడుదల

బాలీవుడ్ హ్యాండ్సమ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది వీవాన్'. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అరుణాభ్ కుమార్ కథను అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్‌ది వైరల్ ఫీవర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. సూర్యాస్తమయం తర్వాత ఎక్కడికి వెళ్లడం నిషిద్ధమో.. కథ అక్కడి నుంచే మొదలవుతుందనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఎవరైతే రాత్రి సమయంలో ఆ అడవిలోకి వెళ్తారో వారు తిరిగి రారనే ఒక దట్టమైన చీకటి శక్తి, రహస్యాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో సిద్దార్థ్ మల్హోత్రా ఇప్పటివరకు చూడని సరికొత్త యాక్షన్ అవతార్‌లో కనిపించగా, ఆయనకు ఆ అడవికి మధ్య ఏదో గూఢమైన సంబంధం ఉందని తమన్నా పాత్ర చెబుతుంది. టీజర్ చివర్లో వచ్చే విజువల్స్ దైవిక శక్తులు మరియు పురాణాల నేపథ్యాన్ని గుర్తుచేసేలా ఉన్నాయి. ఈ చిత్రంలో సిద్దార్థ్, తమన్నాలతో పాటు సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ మరియు అనూప్ సోని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# బికినీతో రక్షాబంధన్ యాడ్

## విమర్శల వెల్లువతో సోషల్ మీడియా నుంచి తొలగింపు

ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'గీవా' ఇటీవల విడుదల చేసిన రక్షాబంధన్ ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటి కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాడ్ సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే, పలువురు నెటిజన్లు మరియు కొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. హిందూ సంప్రదాయాలను, పవిత్రమైన రక్షాబంధన్ పండుగను తప్పుగా చిత్రీకరించేలా ఈ ప్రకటన ఉందంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. పండుగ పవిత్రతకు భంగం కలిగించేలా యాడ్ కంటెంట్ ఉందంటూ బ్రాండ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో వ్యతిరేకత పెరగడంతో అప్రమత్తమైన 'గీవా' యాజమాన్యం తక్షణమే స్పందించింది. వివాదాస్పదమైన ఆ ప్రకటనను అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, మీడియా మాధ్యమాల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ వివాదంపై వివరణ ఇస్తూ జీవా సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగలపై మాకు అత్యంత గౌరవం ఉంది. ఎప్పుడూ కుటుంబ సభ్యులందరితో కలిసి పండుగలను ఆనందంగా జరుపుకోవడాన్ని నమ్మే మా బ్రాండ్, ఈసారి ఆ ఆనందాన్ని పెంపుడు జంతువులకు కూడా విస్తరించాలనే మంచి ఉద్దేశంతో ఈ కాన్సెప్ట్‌ను రూపొందిం చాము. అయితే, మా తాజా ప్రకటన సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలను అనుకోకుండా గాయపరిచినట్లయితే, అది మా ఉద్దేశం కానే కాదు. అందరి మనోభావాలను, నమ్మకాలను గౌరవిస్తూ ఆ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నాము అని సంస్థ స్పష్టం చేసింది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com